


# ప్రశ్నించే నీడ

సయ్యద్ గఫార్

అది డిసెంబర్ నెల.

ప్రకృతి కన్య - పచ్చని పరికిణీ, రవిక ధరించి, తెల్లని మంచు పొర ఓణీ కప్పుకొని, సువాసనల మందహాసాలతో హొయలు పోతూంటే - అలా తనివితీరా ఆస్వాదిస్తూ నన్ను నేను మర్చిపోవటమంటే నాకెంతో ఇష్టం.

నేల పొత్తిళ్ళలో దొరాడే పొగమంచు పొరలను, దినకరుడు తన లేలేత కిరణాలతో తెరలు తెరలుగా ఛేదించుకుంటూ భూమిని ఆక్రమించుకునేటప్పటి దృశ్యాలను తిలకిస్తూ నేను పొందే అనుభూతిని మాటల్లో వ్యక్తపర్చలేనేమో.

అలాంటి అద్వితీయానుభూతుల్ని ఈసారి కోల్పోక తప్పిందికాదు.

మా ఆవిడ పుట్టింటికెళ్ళటం, నాకు హోటల్ భోజనం సయించకపోవడం - ఉదయాన్నే తప్పని స్వయంపాకం. ఇత్యాది కారణాలు.

రోజూలాగే ఆ రోజు లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, అత్యవసరపు అంట్లు కొన్ని తోముకొని, బియ్యం కడిగి, గ్యాస్ స్టౌ మీద పెట్టి, అలా గడపలో నుంచున్నాను, కొసరు మంచుపొగ దృశ్యాలను తిలకిస్తూ-

అప్పుడే - బాత్‌రూం గోడపై కాకి ఒకటి వాలి, అదే పనిగా అరుస్తోంది.

నిజం చెప్పొద్దూ - నామటుకు నాకు - అలా మంచు పరదాల మధ్య, కాకి అరుపు కూడా వీనులవిందుగా విన్పిస్తుంది. నా భావుకతా పిచ్చికది పరాకాష్ట కావచ్చునేమో నాకు తెలీదు.

కాని, నేనున్న ఇంటి యజమాని - అప్పుడే సంధ్యా వందనంలో పంచాక్షరి జపిస్తూ - ''ఏమేవ్ పంకజం... మీ నంద సోదరులు ఎవరైనా వస్తారేమోనే! చూడు. కాకి కబురు తెచ్చింది...'' అంటూ వాళ్ళావిడతో సరసానికి దిగాడు.

''చాల్లెండి! పొద్దునే వేళయ్యిందీ... అక్కడికి తమరేదో మహా పండితులైనట్లూను, మా తమ్ముళ్ళేమో శుంఠల యినట్లూను. అర్థం పర్థం లేకుండా సరసాలాడ్డం మీకే చెల్లింది. అయినా - నా తమ్ముళ్ళు తద్దినపు భోక్తలేం కాదులెండి'' అంటూ ఇంట్లో నుంచే ఓ చురక అంటించింది ఆవిడగారు.

''ఆహా! అలాగా? అయితే కాకి ఎందుకు అరిచిందంటావ్?''

''ఇవ్వాళ్ళ మీ నాన్నగారి శ్రాద్ధం కదా? మీ పితృదేవులై ఉంటారు. కాస్త పరికించి చూడండి'' అంది ఆవిడ.

ఆకలి ఆమెను
'ముండని' అన్పిస్తున్నందుకు
నా హృదయంలో ఎక్కడో
కలుక్కుమంది.
''అమ్మా! దయగల
తల్లే...'' అలా ఇంకేదో
అనబోయి ఓ అడుగు గేటు
లోపలికేసింది. అంతే-
త్రాచుపాములా కస్సున
లేచాడు ఇల్లుగలాయన.

వాళ్ళకున్న ముగ్గురు సంతానంలో - మగపిల్లలిద్దరూ హైదరాబాద్‌లో చదువుతున్నారు. ఉన్న ఒక్కగానొక్క కూతురు పెళ్ళయి అత్తారింటికి కాపురానికెళ్ళింది. పల్లెల్లోనున్న భూమిని కౌలుకిచ్చేసి, ఆ వచ్చిన డబ్బుతో ఎటువంటి ఆర్థిక ఇబ్బందుల్లేకుండా గడిచిపోతుందాళ్ళకు.

కాకి - గోడ మీద ఇంకా అరుస్తూనే ఉంది.

ఇంటిగలాళ్ళ సరస సంభాషణకు నేపథ్య సంగీతం లాగుంది కాకి అరుపు.

అప్పటికి సమయం ఆరుగంటలు కావస్తోంది. స్టౌ మీద అన్నం పొంగిన చప్పుడుతో తేరుకొని లోపలికెళ్ళి - గిన్నెమీద మూతతీసి అన్నం కలిపి మూతపెట్టాను. చకచకా నాలుగు ఉల్లిగడ్డలు తరిగి, నాలుగు బంగాళాదుంపలు వేపుడుకు సిద్ధంచేసి పక్కకు పెట్టి - తిరిగి ప్రకృతిని తిలకిస్తూ గడపలో నుంచున్నా.

అప్పటికే - సూర్యప్రతాపాన్ని తట్టుకోలేక పొగ మంచుకాస్తా విడిపోయింది.

ట్రైనెక్కిన ప్రేయసి - టాటా చెప్పక ముందే - ట్రైనెళ్ళి పోయినంత బాధనిపించింది నాకు.

సరిగ్గా అప్పుడే-

''అమ్మా! గింతన్నం పెట్టు తల్లీ!'' గేటు వద్ద బిచ్చగత్తె అరుపుతో అటుకేసి చూశాను.

చిరిగిన గుడ్డల్లో యవ్వనాన్ని దాచుకొనే ప్రయత్నం చేస్తూ... నిండుగా ఇరవై సంవత్సరాలు నిండని బిచ్చగత్తెను చూశాక - అప్పటి వరకూ నాలో కమ్ముకున్న ప్రకృతి ఆరాధన లాంటిది కాస్తా కరిగిపోయింది.

ఇప్పుడు ప్రకృతి - పొల్యూషన్‌తో కమిలిపోయి - బిచ్చగత్తె రూపంలో కనిపిస్తుంది.

స్వాతంత్ర్యదినాన నిర్వహించే సాంస్కృతిక ఉత్సవాల్లో 'భరతమాత' పాత్రధారిణే, అతిదారుణంగా చెరచబడి, వేదిక దిగి పారిపోయి వచ్చినట్లుందామె.

''అమ్మా! గింతన్న పెట్టు తల్లో' మళ్ళీ అర్థింపు.

ఆమె గిన్నె పట్టుకున్న వైనం చూస్తే ఏ తల్లీ కూడ కాసిన్ని చద్ది మెతుకులు వేసినట్లు లేదు.

'అమ్మా' అనిపించుకోని ఆడబ్రతుకు ఎందుకు?'

''ఆకలయితుందమ్మా గింతన్న పెట్టండమ్మా. పున్నెముంటది తల్లో' అర్థిస్తూనే ఉంది.

ఇల్లుగలావిడ - వాళ్ళ మామగారి శ్రాద్ధకర్మలకు పిండివంటలు చేస్తుంది లాగుంది. వాటి తాలూకు వాసన కమ్మగా నాసికారంధ్రాలకు సోకుతుంది. బహుశా బిచ్చగత్తెకు కూడా ఆ వాసన సోకి ఉంటుంది. అందుకే ఆశగా నుంచుని అర్థిస్తుంది.

''అమ్మా! దయగల తల్లే. గింతచద్దన్నముంటే పెట్టుమ్మా!'' పదేపదే ఏకబిగిన అర్థిస్తుంది.

''అప్రాచ్యపు ముండా! అవతలకి తొలగు'' పంచాక్షరి జపిస్తూనే - ఆవిడ బదులు ఇంటిగలాయన జవాబులాంటి అరుపు.

''ఏదో అయ్యా! పేదముండని! గింతన్నం పెట్టైయండి బాబు. పున్నెముంటది'' వేడుకొంటుంది.

ఆకలి ఆమెను 'ముండని' అన్పిస్తున్నందుకు నా హృదయంలో ఎక్కడో కలుక్కుమంది.

''అమ్మా! దయగల తల్లే...'' అలా ఇంకేదో అనబోయి ఓ అడుగు గేటు లోపలికేసింది. అంతే-

త్రాచుపాములా కస్సున లేచాడు ఇల్లుగలాయన.

''భ్రష్టుముండా! అవతలకి తగలడు. చెప్పేది నీక్కాదూ. ఛీ... ఛీ... వెధవముండలు - వెధవ ముండలు... బాబుగాడి సొమ్మేదో దాచిపెట్టినట్లూ... పొద్దున్నే తగలడ్తారు. వెళ్ళవే! వెళ్ళవతలకి''

ఊహించని సంఘటనతో బిత్తరపోయిన బిచ్చగత్తె మరో గడప వైపుకు నడిచింది.

అక్కడా అలాంటిదే జవాబు.

బిచ్చగత్తె దీనవదనం కళ్ళలో మెదలుతూంటే - అన్యమనస్కంగానే, వంట పూర్తిచేసి ఏదో కాస్త తిన్నట్లు చేసి- దినచర్యల్లో పడిపోయాను.

ఆకలెరుగని కాలం - కాలం గడపలు తొక్కుతూ - వారంరోజులు వెనక్కు వేసింది.

మా ఆవిడను పుట్టింటాళ్ళు ఇంకా పంపలేదు.

ఇల్లుగలావిడ కూడా వాళ్ళన్నయ్య కూతురి కార్యానికని వెళ్ళి తిరిగి రాలేదు.

ఇంత పెద్ద ఇంట్లో - ఇంటి యజమానితో కలుపుకొని ఇద్దరమే మగపురుగులం.

ఆచారాలంటే - నా ఒంటికి సరిపడవు గనక నాకు - ఇంటి యజమానికి మధ్య దాదాపుగా మాటలు మృగ్యమనే చెప్పొచ్చు.

ఇంటికెళ్ళినా బోర్‌గా ఉంటుంది కాబట్టి - ఆఫీసు నుండి బయటపడి, తొమ్మిదింటి వరకు కొలీగ్స్‌తో బాతాఖానీ పెట్టి, అటు నుంచి అటు సెకండ్ షో సినిమాకెళ్ళాం. మధ్యమధ్యలో కరెంటు కోత మూలంగా - సినిమా విడిచేటప్పటికి పన్నెండు గంటలు దాటింది.

డిసెంబర్ నెల చలి తన ప్రతాపాన్ని చూపిస్తోంది. గడగడా వణుక్కుంటూ 'గుడ్‌నైట్స్' చెప్పుకొని ఇంటిదారి పట్టాం.

ఇంటికి చేరుకునేసరికి రాత్రి ఒంటిగంటయింది.

ఇల్లుగలాళ్ళింట్లో ఇంకా లైటు వెలుగుతూనే ఉంది.

చలికి వణికే చేతుల్తో - తాళంకప్ప తీసి గదిలోకెళ్ళి లైట్ వేశాను.

ఇల్లుగలాళ్ళింట్లోంచి ఏవో మాటలు విన్పిస్తున్నాయి. 'ఆవిడ లేదే' వచ్చింది గాబోలు అనుకొని డ్రెస్ మార్చుకొని - మంచినీళ్ళు తాగి, లైట్ ఆర్పేసి బెడ్‌మీద వాలాను.

మళ్ళీ మాటలు వినిపిస్తున్నాయి.

''సిగ్గెందుకే... రా'' ఇల్లుగలాయన తగ్గుస్వరం.

''ఊహు...'' స్త్రీ గొంతు.

ఆవిడ మాత్రం కాదు.

ఆశ్చర్యంగా లేచి కూర్చున్నాను.

లైట్ ఆఫ్ చేసిన శబ్దం.

మాటలు
ఆగిపోయాయి.
అడుగుల చప్పుడు-
మంచు కురుస్తున్న మసక
వెన్నెల్లోంచి ఓ స్త్రీ ఆకారం
నడచి వెడుతుంది.
ఆశ్చర్యం! ఆమె... ఆమె మసక
మసగ్గా కనిపిస్తుంది.
ఆమె ! ముమ్మాటికీ ఆమె.

''సృష్టి కార్యానికి తప్పేంటే... రా'' అయనగారు.

''మరే... మరే...'' ఆమే ఏదో చెప్తూ చెప్తూ ఆగిపోయింది.

''ఓసినీ ఆశ తగలడా... మరి చెప్పవే... పద'' ఇల్లుగలాయన.

తిరిగి లైట్ వేసిన చప్పుడు.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం - అడుగుల చప్పుడు - గిన్నెల చప్పుడు.

మాటలు గుసగుసలుగా మారాయి.

ఐదు నిమిషాల నిశ్శబ్దం తర్వాత - గిన్నెల చప్పుడు - అడుగుల చప్పుడు.

లైట్ స్విచ్ ఆఫ్ చేసిన శబ్దం.

నవ్వులు - గుసగుసలు - మాటలు మంద్రస్థాయిలో విన్పిస్తున్నాయి.

మళ్ళీ కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

తర్వాత-

మూల్గులు - ఉచ్ఛ్వాస నిశ్వాసలు - అంతే.

దీర్ఘశ్వాస ఒకటి విడిచి మంచంపై వాలాను.

''ఆమె ఎవరు? ఎవరు? ఎవరు?'' ఇదే ప్రశ్న లైటు చుట్టూ పురుగులా తిరుగుతుంది.

క్షణాలు, నిముషాలు, గంటలుగా గడిచాయి.

తిరిగి అస్పష్టమైన మాటలు.

మెత్తటి అడుగుల చప్పుడు.

తలుపులు తెరుచుకున్న శబ్దం - బహుశా బయటి తలుపయి ఉంటుంది.

ఏవో మాటలు అస్పష్టంగా విన్పిస్తున్నాయి.

ఊహించని సంఘటన తారసపడ్డప్పుడు సహజంగా ప్రతి మనిషిలో వుండే ఉద్విగ్నత నాలోనూ-

సందేహ నివృత్తి కోసం నాకు తెలీకుండానే కిటికీ రెక్కలు కొంచెం తెరిచేలా చేసింది.

''మళ్ళీ ఎప్పుడొస్తావు?'' ఆయన ప్రశ్న.

''రేపు ఆకలి యాలకు'' ఆమె జవాబు.

ఆ స్వరం ఎక్కడో విన్నట్లుంది. ఎక్కడ విన్నానో ఓ పట్టాన గుర్తుకు రావటంలేదు.

మాటలు ఆగిపోయాయి.

అడుగుల చప్పుడు-

మంచు కురుస్తున్న మసక వెన్నెల్లోంచి ఓ స్త్రీ ఆకారం నడచి వెడుతుంది.

ఆశ్చర్యం! ఆమె... ఆమె మసక మసగ్గా కనిపిస్తుంది.

ఆమె ! ముమ్మాటికీ ఆమె.

''అమ్మా! గింతన్నం పెట్టు తల్లో!''

ఆమె వెనకాల ఆమె ఆకలి నీడ!

గేటు దాటి వెళ్ళిపోయింది. ఆమె వెంట ఆమె ఆకలి నీడ-

లైంగిక దోపిడీని, తృణప్రాయం చేసిన ఆమె క్షుద్బాధా దృశ్యాన్ని జీర్ణించుకోలేక అలా - నిర్జీవంగా బెడ్‌పై వాలిపోయాను.

ఆమె నీడ - ప్రశ్నయి, ఇప్పటికీ నన్ను వెంటాడుతూనే ఉంది. ☆